

శిథిలావస్థలో ఉన్న ఇంటిని చూపుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



సర్వే నంబర్ 62లో భూమిని దున్నుతున్న ట్రాక్టర్

# లంచం ఇచ్చినోళ్లకే ఇందిరమ్మ ఇండ్లా?

**పేదలకు అన్యాయం జరిగితే ఊరుకోం**

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్
- కాగజ్‌నగర్ పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటన

కాగజ్‌నగర్, జూన్ 24: ఇందిరమ్మ ఇండ్ల పథకంలో కాంగ్రెస్ పార్టీ అవినీతికి పాల్పడుతున్నదని, అర్హులైన వారికి ఇండ్లు ఇవ్వకుండా లంచం ఇచ్చినోళ్లకే ప్రాధాన్యమిచ్చారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని పలు కాలనీల్లో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారులు గ్రామ స్థాయిలో సర్వే చేయకుండానే లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారని, ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్సీ ఆధారంగా సెలెక్ట్ చేశామని చెప్పడం దారుణమన్నారు. ఇప్పుడు పేదల సమస్యలను కాంగ్రెస్ నాయకులు లేక అధికారులు తీరుస్తారా? ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్ తీరుస్తుందా? అని ప్రశ్నించారు. ప్రజలు టెక్నాలజీకి ఓట్లు వేయలేదని, రేవంత్ రెడ్డికి వేశారని.. అందుకే కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కందుల పుష్పలీల, ఉషాదేవిల పేర్లు మొదటి లిస్టులో వచ్చినప్పటికీ ఒంటరి మహిళ, వృద్ధురాలు అనే కారణంతో చివరకు ఇండ్లు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ లేదా విధివిధానాల్లో ఎక్కడా కూడా ఒంటరి, వృద్ధ మహిళలు అనర్హులని చెప్పలేదన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు బాధితులను ఆయన పరామర్శించారు. వారికి పండ్లు పంపిణీ చేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై కోలుకున్న బాలస్వామి కుటుంబాన్ని కలిశారు. మెరుగైన వైద్య సహాయం కోసం హైదరాబాద్‌లోని డాక్టర్లతో మాట్లాడారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువు ఆపేయడంతో బాలస్వామి కూతురిని చదివించాలని, చదువు విషయంలో పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. హై బీపీతో బాధపడుతూ మంచానికే పరిమితమైన దౌలత్ కుటుంబాన్ని కలిసి వైద్యఖర్చుల కోసం ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తాజ్ మహమ్మద్ బాబా, మాజీ కౌన్సిలర్ మిన్హాజ్, యూత్ నాయకులు కాశిపాక రాజు, మహిళా నాయకురాలు వరలక్ష్మి, కమల పాల్గొన్నారు

### బీఆర్ఎస్‌లో చేరికలు

కౌటాల, జూన్ 24 : కన్నెపల్లి గ్రామానికి చెందిన 15 మంది మహిళలు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామ మహిళలు అభివృద్ధికోసం కట్టుబడి ఉండడం ఎంతో అభినందనీయమన్నారు. గ్రామంలోని యువత వ్యసనాలకు దూరంగా ఉండి.. మద్య నిషేధం, జూదం, మట్కా, కోడి పందేలవంటివి వ్యతిరేకించడం అభినందనీయమన్నారు. బీఆర్ఎస్ సర్కారులో చేపట్టిన అభివృద్ధిని చూసి.. కేసీఆర్‌పై ఉన్న అభిమానంతో బీఆర్ఎస్‌లో చేరడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళలు ఆయను సన్మానించారు.



కౌటాల: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను సన్మానిస్తున్న కన్నెపల్లి గ్రామ మహిళలు

# 12 ఎకరాలు దున్నేసిండ్రు..

**ర్యాలీ గ్రామంలో గిరిజన రైతుల భూములపై కాంగ్రెస్ నాయకుల కన్ను**

- ప్రైవేట్ పట్టా భూమిలో ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ
- న్యాయం చేయాలంటూ అధికారులను కలిసిన బాధితురాలు
- మరుసటి రోజే ఆ కుటుంబానికి ఉన్న మొత్తం భూమిని దున్నేసిన కాంగ్రెస్ లీడర్లు
- కలెక్టర్‌ను కలిసినందుకే ఇలా చేస్తున్నారని వాపోతున్న బాధితులు

మంచిర్యాల, జూన్ 24(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం ర్యాలీ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం ఆదివారం ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు భూమి పూజ చేసిన భూమి తనదంటూ అజ్మీర లక్ష్మి సోమవారం కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ విషయం చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో బాధితులకు న్యాయం జరుగుతుందని అంతా భావించారు. కానీ, స్థానిక కాంగ్రెస్ లీడర్లు మాత్రం ఎమ్మెల్యే పీఎస్ఆర్ చెప్పారంటూ బాధితురాలు అజ్మీరా లక్ష్మి సహా వారి కుటుంబ సభ్యులకు వారసత్వంగా వచ్చిన 12 ఎకరాల భూమిని మంగళవారం దున్నేశారు. పట్టాదారులు ఎవరైనా భూమి వద్దకు వస్తే చంపేయమని ఎమ్మెల్యే చెప్పారంటూ బాధితులను బెదిరించిన సదరు నాయకులు ట్రాక్టర్లు పెట్టించి మరీ భూములు దున్నించారంటూ బాధితులు వాపోతున్నారు.

### వారసత్వంగా వచ్చిన భూములే...

రెవెన్యూ రికార్డులు, గతంలో అధికారులు ఇచ్చిన ప్రొసిడింగ్స్‌ను పరిశీలిస్తే ర్యాలీ గ్రామంలోని అజ్మీర సర్వా నాయక్‌కు సర్వే నంబర్లు 53(53ఈ), 62, 129(129/ఆ)లో 5.14 ఎకరాలు, 3.12 ఎకరాలు, 4.02 ఎకరాల భూమి ఉంది. ఈయన చాలా కాలం క్రితం చనిపోయాక 2006లో ఆయన వారసులు తమ తాత పేరుమీద ఉన్న భూమిని తమ పేరుపైకి మార్చాల్సిందిగా ఉట్నూర్ ఐటీడీఏ పీవోకు పిటిషన్ పెట్టుకున్నారు. ఆ పిటిషన్‌ను పరిశీలించి పీవో స్థానిక రెవెన్యూ అధికారులతో వెరిఫికేషన్ చేయించారు. అజ్మీర సర్వా నాయక్‌కు పూల్‌సింగ్, లాల్‌సింగ్ ఇద్దరు కొడుకులున్నారని, లాల్‌సింగ్‌కు అజ్మీర భూమానాయక్, చందూనాయక్, పూల్‌సింగ్‌కు దేవ్‌సింగ్ అనే ముగ్గురు కుమారులు ఉన్నారని, దరఖాస్తు పెట్టుకొంది వారి వారసులేనంటూ తేల్చి చెప్పారు. ఈ మేరకు అప్పుడున్న ఉట్నూర్ ఐటీడీఏ పీవో భూమిని గిరిజనుల నుంచి తీసుకొని, సర్వా నాయక్ వారసులకు అప్పగించాల్సిందిగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు 2017లో హాజీపూర్ మండల తహసీల్దార్ గ్రామస్తుల నుంచి అభ్యంతరాలు స్వీకరించేందుకు నోటిఫికేషన్ ఇచ్చారు. దానిపై ఎలాంటి అభ్యంతరాలు రాకపోవడంతో పార్టిషన్ చేసి భూమిని వారసుల పేరుమీదకు మారుస్తూ ప్రొసిడింగ్స్ ఇచ్చారు. అప్పటికే ఆ భూములను గిరిజనేతరులైన కొందరు సాగు చేస్తూ సర్వా నాయక్ వారసులను భూమిలోకి రానివ్వలేదు. దీంతో అధికారులే ప్రొటెక్షన్ కల్పించి మరీ పొజిషన్ ఇప్పించారు. అనంతరం 2018లో తెలంగాణ పట్టాపాస్ బుక్కులు సైతం వచ్చాయి. అప్పటి నుంచి పొజిషన్‌లో తామే ఉంటున్నామని సర్వా నాయక్ వారసులు చెబుతున్నారు.



ఈ నెల 23న ప్రజావాణిలో మంచిర్యాల కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం ఇస్తున్న అజ్మీర లక్ష్మి

### ఎమ్మెల్యే పేరు చెప్పి దున్నేసి..

ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎమ్మెల్యే పీఎస్ఆర్ భూమి పూజ చేసిన భూమి సర్వే నంబర్ 129/ఆ/2లో ఉంది. అక్కడ పట్టాదారులకు నాలుగు ఎకరాలు ఉన్నట్లు చెబుతున్నారు. బాధితురాలు కలెక్టర్‌ను ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా ఆ నాలుగు ఎకరాలతో పాటు అజ్మీర సర్వా నాయక్ కుటుంబానికి ఉన్న మొత్తం 12 ఎకరాల భూమిని కాంగ్రెస్ నాయకులు దున్నించినట్లు బాధిత కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ప్రభుత్వం ఎస్టీలకు ఇచ్చిన భూమిలో గిరిజనేతరులు వచ్చి దున్నుతుంటే అధికారులు అడ్డుకోవడం లేదంటూ వాపోతున్నారు. న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినా స్థానిక లీడర్లు పట్టించుకోవడం లేదంటున్నారు. మీ కుటుంబానికి చెందిన మొత్తం భూములను ఎమ్మెల్యేనే దున్నుకోమన్నారని.. భూములను దున్నిస్తున్న సదరు కాంగ్రెస్ లీడర్లు చెబుతున్నారని బాధితులు అంటున్నారు. ఎస్టీలకు ఇచ్చిన భూముల్లోకి వచ్చి దౌర్జన్యం చేస్తుంటే రెవెన్యూ అధికారులు, పోలీసులు పట్టించుకోనట్లు వ్యవహరిస్తున్నారంటున్నారు. . భూములు దున్నిన లీడర్లే మాపై ఉల్టా కేసులు పెట్టేందుకు సిద్ధమవుతున్నారని, భూముల్లోకి వస్తే చంపేస్తామని బెదిరిస్తున్నారని వాపోతున్నారు. దీనిపై రామగుండం సీపీతో పాటు ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని బాధితులు తెలిపారు. గతంలో అధికారులే దగ్గరుండి మరీ వారసులకు పొజిషన్ అప్పగిస్తే, ఇప్పుడున్న అధికారులు అదే భూముల్లో ఇందిరమ్మ ఇండ్లకు దగ్గరుండి భూమి పూజ చేయించడం వివాదాస్పదంగా మారింది. పేదలకు ఇచ్చే ఇందిరమ్మ ఇండ్లను అడ్డం పెట్టుకొని ఓ గిరిజన కుటుంబానికి చెందని మొత్తం భూములను కాంగ్రెస్ లీడర్లు లాక్కోవాలని చూస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఈ వ్యవహారాన్ని జిల్లా అధికారులు సీరియస్‌గా తీసుకుంటారా.. లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది.

# బీఆర్ఎస్ నాయకులపై కేసు

మంచిర్యాల, జూన్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఇటీవల మంచిర్యాల జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ విద్యార్థి నాయకుడు దగ్గుల మధుపై దాడిని నిరసిస్తూ శుక్రవారం బెల్లంపల్లి చౌరస్తాలో ధర్నా చేసిన నాయకులపై పోలీసులు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా చేసిన ధర్నాతో వాహనదారులకు ఇబ్బంది ఏర్పడిందని, లా అండ్ ఆర్డర్ సమస్య వస్తుందని చెప్పినా వినకుండా విధులకు ఆటకం కలిగించారని, అక్కడి నుంచి పంపించి వేస్తే.. పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ఇదే తరహా ధర్నా చేశారని, దీనివల్ల వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదుదారులు ఇబ్బందులు పడ్డారంటూ హెడ్ కానిస్టేబుల్ అన్వర్ హుస్సేన్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావుతో పాటు రాష్ట్ర నాయకుడు విజిత్‌రావు సహా 30 మందిపై 189(2), 126(2), 132,ఆర్/డబ్లు 190 బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. కాగా, దీనిపై బీఆర్ఎస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అదే రోజు కాంగ్రెస్ నాయకులు సైతం అదే బెల్లంపల్లి చౌరస్తాలో ధర్నా చేశారని, మరి వారిపై ఏం కేసులు పెట్టారో.. అసలు ఆ ధర్నా పోలీసులకు ఎందుకు కనిపించ లేదో.. చెప్పాలంటున్నారు. బీఆర్ఎస్ ధర్నా చేస్తే వచ్చిన ఇబ్బందులు కాంగ్రెస్ నాయకులు చేసినప్పుడు రాలేదా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇందుకు పోలీసులు సమాధానం చెప్పాలని కోరుతున్నారు. న్యాయం కోసం ధర్నా చేస్తే కేసులు నమోదు చేయడం సరికాదని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు విజిత్‌రావు తెలిపారు.

# ఉప్పొంగిన రాజూర ఒర్రె

- లో లెవల్ వంతెనపై భారీగా వరద
- రెండు గంటల పాటు నిలిచిన రాకపోకలు



లో లెవల్ వంతెనపై నుంచి ప్రవహిస్తున్న వరద.. అవతలి ఒడ్డుపై వేచి ఉన్న గ్రామస్తులు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్/ జన్నారం, జూన్ 24 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రాజూర గ్రామానికి సమీపంలోని ఒర్రె ఉప్పొంగి ప్రవహించింది. లో లెవల్ వంతెనపై నుంచి వరద వెళ్లగా, దాదాపు రెండు గంటల పాటు రాకపోకలు స్తంభించాయి. ఆసిఫాబాద్‌కు వెళ్లి వస్తున్న ప్రజలు, విద్యార్థులు వేచి చూడాల్సి వచ్చింది. వంతెనలో చెత్త ఇరుక్కుపోవడంతో వరద పై నుంచి ఉధృతంగా ప్రవహించగా, ఇరువైపులా రోడ్డు కోతకు గురైంది. ఈ నెలలో మూడుసార్లు వంతెనపై నుంచి వరద ప్రవహించిందని, అధికారులు చొరవ చూపి కొత్తగా వంతెన నిర్మించాలని ప్రజలు వేడుకుంటున్నారు. ఇక మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో జోరుగా వానపడింది. పత్తి విత్తనాలు నాటిన రైతులకు ఈ వర్షం ఊరటనిచ్చింది.

# ఇళ్లల్లోకి వరద వస్తున్నా పట్టదా?

- వెంటనే శాశ్వత పరిష్కారం చూపాలి
- బంబారలోని ఎస్సీ కాలనీవాసుల డిమాండ్
- నాగ్‌పూర్-హైదరాబాద్ జాతీయ రహదారిపై ధర్నా



బంబారలో జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న ఎస్సీ కాలనీ వాసులు

వాంకిడి, జూన్ 24 : డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక వర్షపు నీరంతా ఇళ్లల్లోకి చేరుతున్నదని, వెంటనే శాశ్వత పరిష్కారం చూపాలని బంబార గ్రామంలోని ఎస్సీ కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక నాగపూర్ – హైదరాబాద్ జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక యేటా వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఈ విషయమై అనేకసార్లు అధికారుల దృష్టి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గంట పాటు రోడ్డుపై బైఠాయించడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయి వాంకిడి తహసీల్దార్ కవిత ఘటనా స్థలానికి చేరుకొని ఎస్సీ కాలనీ వాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో కాలనీవాసులు ఆందోళన విరమించారు.తహసీల్దార్ వెంట ఆర్ఐ మాజీత్, వాంకిడి ఎస్ఐ ప్రశాంత్, తదితరులు ఉన్నారు.



బురదదారిలో అవస్థలు పడుతూ వస్తున్న వాహనదారులు

# రోడ్డు ఇలా..వెళ్లేదెలా ?


- బురదమయంగా మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి వెళ్లే దారి
- ఇబ్బంది పడుతున్న గర్భిణులు, బాలింతలు

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులోగల మాతా శిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్) కు వెళ్లే రోడ్డు బురదమయంగా మారింది. చికిత్స కోసం వస్తున్న గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వ్యాక్సిన్లు వేయించేందుకు వస్తున్న కుటుంబ సభ్యులు ఇబ్బంది పడుతున్నారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి ఆ ప్రాంతం బురదమయంగా మారింది. ఆ దారి వెంట ప్రయాణించాలంటే గర్భిణులు, బాలింత అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎంసీహెచ్‌కు వెళ్లే రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

- మంచిర్యాల అర్బన్, జూన్ 24

# కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కెరమెరి, జూన్ 24: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేద యువతుల పెళ్లిళ్లకు ఆర్థికసాయమందించే ఉద్దేశంతో కేసీఆర్ సర్కారు కల్యాణలక్ష్మి పథకం తీసుకొచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భూమేశ్వర్, నాయకులు పెందోర్ మోతీరాం, సెడ్మాకి దుర్పతాబాయి, సయ్యద్ అబూల్ కలాం, తదితరులు పాల్గొన్నారు.



కెరమెరి తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా**

జైపూర్, జూన్ 24: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్‌ఝా పేర్కొన్నారు. మత్తు పదార్థాల నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలకేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను మంచిర్యాల డీసీపీ భాస్కర్‌తో కలిసి సందర్శించారు. పాఠశాలకు వచ్చిన కమిషనర్‌కు విద్యార్థులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. అనంతరం సీపీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా చితికిపోతారని పేర్కొన్నారు. విద్యార్థులు తమ భవిష్యత్, జీవిత లక్ష్యంపై మాత్రమే దృష్టి పెట్టాలన్నారు. గంజాయి రహిత ప్రాంతమే లక్ష్యంగా రామగుండం కమిషనరేట్ పోలీసులు పనిచేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రవర్తనను ఎప్పటికప్పుడూ గమనిస్తూనే ఉండాలని సూచించారు. ఎక్కడైనా గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరం విద్యార్థులతో కలిసి మాదక ద్రవ్యాల నిర్మూలన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు మల్లారెడ్డి, శ్రీనివాస్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్ఐలు శ్రీధర్, శ్వేత పాల్గొన్నారు.





జైపూర్ గురుకులంలో మత్తు పదార్థాల నిర్మూలనకు సంబంధించిన పోస్టర్లు ప్రదర్శిస్తున్న సీపీ అంబర్‌కిషోర్ ఝా